## జోలాపుట్టు రిజర్వాయర్ పరిశీలన

రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న తహశీల్దార్

**ప్రజాశక్తి-ముంచింగిపుట్టు :** జోలాపుట్టు రిజర్వాయర్‌ను మంగళవారం తహశీల్దార్ శంకరరావు పరిశీలించారు. రిజర్వాయర్లో రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 2750.00 అడుగులు కాగా, ప్రస్తుత నీటి స్థాయి 2745.30 అడుగులు ఉందన్నారు. క్యాచ్‌మెంట్ ఏరియాలో అధికంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డ్యాంలోకి భారీగా నీరు వచ్చిచేరుతోందని, గరిష్టస్థాయికి చేరుకుంటే ఒకటిరెండురోజుల్లో ఏక్షణాన్నైనా గేట్లు తెరిచి నీరు విడుదల చేసే అవకాశం ఉందన్నారు.. నీటి విడుదల సమయంలో దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని.జోలాపుట్టు విఆర్ఒ, విఆర్ఎలకు సూచించారు మాకవరం, పెద్ద సిందిపుట్టు, కుమ్మిరి పడ, మేబా, వలై బీరు, అల్లంగి పడ, సంగడ గ్రామ ప్రజలు అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

# ఆదివాసీ భూముల జోలికొస్తే ఖబడ్దార్!

- గుజ్జెలి హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిబంధనలకు విరుద్ధమని ఆందోళన
- సాంప్రదాయ ఆయుధాలతో ఆదివాసీల నిరసన ర్యాలీ
- నవయుగ కంపెనీ నిర్మించిన సరిహద్దు దిమ్మల ధ్వంసం

**ప్రజాశక్తి-అరకులోయ రూరల్/అనంతగిరి :** అనంతగిరి మండలం గుమ్మకోట పంచాయతీ గుజ్జెలి గ్రామ సరిహద్దులో నిర్మిస్తున్న హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఆదివాసీల చట్టాలు, నిబంధనలకు వ్యతిరేకంగా చేపడుతున్నారని మన్యవాసులు మండిపడ్డారు. ఆదివాసీల భూములు జోలికొస్తే తరిమికొడతామని హెచ్చరించారు. మంగళవారంగునుపాలు, గొడ్డలి, సుత్తి వంటి సాంప్రదాయ ఆయుధాలతో ప్రభుత్వాలకు, కార్పొరేట్ కంపెనీలకు ముఖ్యంగాహైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా నిరసన నినాదాలు చేస్తూ భారీ ఎత్తున ర్యాలీగా వెళ్లారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా నవయుగ కార్పొరేట్ కంపెనీ నిర్మించిన సరిహద్దు దిమ్మలను ధ్వంసం చేశారు.

.ఈ సందర్భంగా ఆదివాసి అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి అప్పలనర్స, అనంతగిరి జెడ్పిటిసి దీసరి గంగరాజు, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్, గుమ్మకోట పంచాయతీ సర్పంచ్ అప్పారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అల్లూరి సీతారామరాజు జిల్లాలో గుజ్జెలి, చిట్టంవలస, పెదకోట హైడ్రోపవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి జిఒ51 జారీ చేసిందన్నారు. ,ఏజెన్సీ ప్రాంతాన్ని, ఇక్కడి భూములను అదానీ నవయుగ వంటి కార్పొరేట్ కంపెనీలకు ధారదత్తం చేయాలని చూడడం దుర్మార్గమన్నారు..గుజ్జెలి హైడ్రోపవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి సరిహద్దు దిమ్మలు నిర్మించారన్నారు ఎగువ డ్యామ్ నిర్మాణం కోసం అరకువేలి మండలం ఇరగాయి, లోతేరు పంచాయతీల పరిధిలో దూదుకొండి, మొర్రిగూడ, కాగువలస, గ్రామ పరిసరాల్లో ప్రాంతంలో నవయుగ కార్పొరేట్ కంపెనీ అక్రమంగా సరిహద్దు సిమెంట్ దిమ్మలు నిర్మించిందన్నారు. సరిహద్దులో సిమెంట్ దిమ్మలు ఏర్పాటు అక్రమమని గుమ్మకోట పంచాయితీ, మండల పరిషత్ ఏకగ్రీవంగా తీర్మానం చేసి, వాటిని వెంటనే తొలగించాలని రెవెన్యూ, పోలీసు,ఐటిడిఎ అధికారులకు నివేదించి, ఫిర్యాదు చేసి 20 రోజులు గడిచినా ఎటువంటి స్పందించలేదన్నారు. ఫిర్యాదులపై తమకేమీ పట్టనట్టు వ్యవహరించడంతోపాటు రాత్రిపూట గ్రామంలో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచి ఆదివాసులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణంతో అరకు, అనంతగిరి మండలాలతో పాటు మన్యం పార్వతీపురం జిల్లా, పాచిపెంట మండలం లో కొన్ని గ్రామాలు కలిపి 35 గ్రామాలు జల సమాధి అవుతాయని, వేలాది ఎకరాల జిరాయితీ, అటవీ భూములు, జీడిమామిడి తోటలు, చెట్లు వన్య ప్రాణులు ఆ ఎ ా ఎ ా ని ు కోల్పోతాయన్నారు. షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసుల హక్కులు, 1/70 చట్టం, పీసా చట్టం, అటవీ హక్కుల చట్టాలను ఉల్లంఘించి, గ్రామసభ అనుమతి లేకుండా ఏకపక్షంగా హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుని నవయుగ కంపెనీకి అప్పగించిందని, ఆదివాసులకు అడవి నుండి గెంటేసేందుకు చేపట్టే ఎటువంటి చర్యలను ఉపేక్షించబోమని హెచ్చరించారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని, ఆదివాసులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుమ్మకోట గ్రామపంచాయతీ, అనంతగిరి మండల ప్రజా పరిషత్, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్‌లో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతులు రద్దు కోరుతూ తీర్మానం చేశాయని, పిసా గ్రామసభలు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేకంగా తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వం నివేదించినా చర్యల్లేకపోవడం సరికాదన్నారు.. గిరిజన సమస్యలను పరిష్కారం చేయడం మానేసి కొత్త సమస్యలను సష్టించడం, గిరిజన హక్కులు,చట్టాలకు విఘాతం కలిగించే చర్యలకు ప్రభుత్వాలు పూనుకోవడం అత్యంత దారుణమైన చర్య అన్నారు. కార్యక్రమంలో పంచాయితీ పిసా కార్యదర్శి కిల్లో రామన్న,ఆదివాసి గిరిజన సంఘం అనంతగిరి మండల నాయకులు వెంకటరమణ, నరాజీ సురేష్ బాబు, కొండన్న గుమ్మకోట, గుజ్జెలి, తదితర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నవయుగ కంపెనీ ఏర్పాటు చేసిన సరిహద్దు దిమ్మలను ధ్వంసం చేస్తున్న ఆదివాసీలు

సాంప్రదాయ ఆయుధాలతో ర్యాలీగా వెళ్తున్న నేతలు, గిరిజనులు

# చినుకు పడితే కునుకు కరువు..

- వరదలతో భీతిల్లుతున్న మన్యం
- జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు
- అవస్థలు పడుతున్న గ్రామస్తులు

విఆర్‌పురం: అన్నవరం, ఉమ్మడివరం మధ్యలో కుంగిన చప్టా

చింతూరు: ఆంధ్రా, ఒడిసా రహదారిపై నిలిచిన వరదనీరు

**ప్రజాశక్తి - చింతూరు :** వారం రోజులుగా ఏజెన్సీలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు కొండ వాగులు పొంగి ప్రవహిస్తూ శబరి నదిలో కలుస్తుండడంతో భారీ స్థాయిలో వరదనీరు ప్రవహిస్తోంది. కుండపోత వర్షానికి రోడ్లు దెబ్బతిన్నాయి. జాతీయరహదారి 30పై నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిల వద్ద గండ్లు ఏర్పడటంతో వాహనాలకు తీవ్ర అసౌకర్యం ఏర్పడింది. భద్రాచలం వద్ద గోదావరి సోమవారం రాత్రి వరకు 38 అడుగులకు చేరుకుని మంగళవారం ఉదయానికి 11 గంటలకు 37.82 అడుగులకు చేరింది. 7.16.520 క్యూసెక్కుల నీరు దిగువ విడుదల అవుతోంది. ధవలేశ్వరం వద్ద ఒంటిగంటకు 10.25 అడుగుల నీటిమట్టం చేరుకుంది. కూనవరం వద్ద శబరి నది నీటిమట్టం 16.82 మీటర్ల వద్ద నిలకడగా ఉంది. కోయ్‌గురు వాగు పొంగి ప్రవహించడంతో ఒరిస్సా ఆంధ్రాకు రవాణాకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. రహదారిపై బ్రిడ్జి ముంపునకు గురైంది. ఇరువైపులా వందలాది లారీలు నిలిచిపోయాయి. సోకలేరు వాగు ఉధృతి తగ్గకపోవడంతో రెండోరోజు కూడా చింతూరు విఆర్‌పురం మండలాలకు రవాణా నిలిచిపోయింది. విఆర్ పురం వద్ద అన్నవరం వాగు ఇంకా ఉధృతంగానే ప్రవహిస్తోంది. మండలంలోని జెల్లివారిగూడెం కూనవరం మండలం కొండరాజుపేట వద్ద రహదారి ముంపునకు గురి కావడంతో రవాణా వ్యవస్థ ఇంకా మెరుగుపడలేదు. చట్టి జాతీయ రహదారి వద్ద వందలాది రవాణా వాహనాలు రోడ్డుపై నిలిచి పోయాయి. తుఫాను కారణంగా మరో 24 గంటల వరకూ ఏజెన్సీలో వర్షాలు విస్తారంగా కురుస్తాయని వాతావరణ శాఖ ఇప్పటికే వెల్లడించింది. చింతూరు శబరి నది వద్ద ముందస్తు చర్యల్లో భాగంగా ఒక మరబోటును అధికారులు ఏర్పాటు చేశారు. మండల కేంద్రానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వచ్చేందుకు వీలు లేకుండా వాగులు పొంగడంతో మండల కేంద్రం జలదిగ్బంధమైంది. వర్షం కారణంగా మండలంలో వీధులన్నీ బురదమయంగా మారడంతో ప్రజలు నడిచేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నారు. నీరు డ్రైనేజీలలో నిలిచిపోవడంతో దోమల బెడద అధికమైంది. అధికారులు సురక్షితమైన నీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

**విఆర్‌పురం:** మండలంలోని అన్నవరం, ఉమ్మడివరం మధ్యలో వెదుళ్లవాగు ఉప్పొంగడంతో తాత్కాలికంగా నిర్మించిన లెలెల్‌చప్టా బీటలు వారింది. ఫలితంగా రెండువైపులా ఉన్న గ్రామాల ప్రజలు వాగులోనే తమ వాహనాలను తీసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. పాలకులు మారుతున్నా అన్నవరం వాగుపై శాశ్వతమైన బ్రిడ్జి నిర్మించడంలో అలసత్వం వహిస్తున్నారని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు తాత్కాలిక పనులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు తప్ప కానీ సుమారు 45 గ్రామాల ప్రజలకు అదే రహదారి అనే విషయం వారు మరిచిపోతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. చప్టా కుంగిపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో వైద్యసేవలకు వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉందని ఇప్పటికైనా అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు.

చింతూరు: జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

# క్రీడలపై దృష్టి సారించాలి

**ప్రజాశక్తి - విఆర్‌పురం:** క్రీడలపై దృష్టి సారించాలని ఐటిడిఎ పిఒ అపూర్వభరత్ అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ ఉమెన్స్ రాష్ట్రస్థాయి శిక్షణ పొంది నెల్లూరులో జరుగుతున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ నెల 24, 25న పాల్గొనున్నారని ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు పూనం కిరణ్‌కుమార్ తెలిపారు. రాష్ట్రంలో సీనియర్ ఉమెన్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీల్లో జిల్లా తరపున అవకాశం రావటం సంతోషకరం అన్నారు. ప్రతిఒక్కరూ ఇదే స్ఫూర్తితో ఉండాలని, యువత చెడు వ్యసనాలకు వెళ్లకుండా క్రీడలవైపు మొగ్గు చూపాలని పిఒ అన్నారు. కార్యక్రమంలో ఎఒ, ఎపిఒ, ఏకలవ్య పిడి ప్రిన్సిపాల్ ఫుట్‌బాల్ అసోసియేషన్ మెంబెర్స్ రాజ్‌కుమార్ ఎ.అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో పిఒ అపూర్వభరత్

# నెలాఖరులోగా భూముల రీసర్వే పూర్తి

- మ్యుటేషన్ల పరిష్కారంలో జాప్యం చేస్తే చర్యలు
- జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె అభిషేక్ గౌడ

**ప్రజాశక్తి -పాడేరు :** భూములు రీ సర్వే, ముటేష్ల ప్రక్రియలో జాప్యం చేస్తే రెవెన్యూ అధికారులపై చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ డాక్టర్. ఎం.జె. అభిషేక్ గౌడ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ నుండి 22 మండలాల తాహశీల్దారులు, సర్వే అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మ్యుటేషన్లు, ఆధార్ సంబంధిత సమస్యలు, అన్నదాత సుఖీభవ డేటా సమస్యలు, రీసర్వేపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించాలని గతంలో సూచించినా నిర్లక్ష్యం చేసిన తాహశీల్దారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విఆర్ఒ, విలేజ్ సర్వేయర్లు మాట వినక పోతే వెంటనే మెసేజ్ చేయండి, వారిని సస్పెండ్ చేస్తామనితాహశీల్దార్లకు సూచించారు. రెవెన్యూ సిబ్బంది, సర్వే సిబ్బందితో రెగ్యులర్‌గా సమీక్షలు నిర్వహించాలని తాహశీల్దార్లకు సూచించారు. రీ సర్వే డేటా నెలాఖరు నాటికి తాహశీల్దారు లాగిన్ నుండి సబ్ కలెక్టర్ లాగిన్‌కు పంపించాలని ఆదేశించారు. ఈనెల 31వ తేదీలోగా 108 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంటిస్థలాల పట్టాలు రీ వెరిఫికేషన్ చేయాలన్నారు. ఎటపాక, కూనవరం, చింతూరు వి ఆర్ పురం మండలాల్లో హౌస్ సైట్ పట్టాలు వెరిఫికేషన్ సక్రమంగా చేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేసారు. అన్నదాత సుఖీభవ సమస్యలు పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జలపాతాల వద్దకు పర్యాటకులను అనుమతించ రాదన్నారు. కంట్రోల్ రూంలు సక్రమంగా పనిచేయాలని ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాలలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. . చింతూరు డివిజన్‌లో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసారని, . అవరమైన చోట సహాయ పునరావాస కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.సమావేశంలో సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, చింతూరు సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, సర్వే సహాయ సంచాలకులు దేవేంద్రుడు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్

# పాఠశాలకు శాశ్వత భవనం నిర్మించరూ..!

**ప్రజాశక్తి - జికెవీధి :** సంకాడ పంచాయతీ గండేంపల్లి గ్రామంలో జిపిఎస్‌టిడబ్ల్యూ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిందని, ప్రస్తుతం రేకులషెడ్‌లో తరగతులు నిర్వహిస్తున్నామని గ్రామస్తులు వాపోయారు. మంగళవారం జనసేన పార్టీ పంచాయతీ అధ్యక్షులు ఉలం ఈశ్వరరావు గ్రామంలో పర్యటించినప్పుడు పాఠశాలకు శాశ్వత భవనం నిర్మించాలని గ్రామస్తులు ఆయనకు విన్నవించారు. ఆయన స్పందిస్తూ కలెక్టర్, జనసేన పార్టీ జిల్లా ఇన్‌చార్జి, జానపదకళలు సృజనాత్మకత చైర్మన్ డాక్టర్ వంపూర్ గంగులయ్య దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. జనసేన పార్టీ పంచాయతీ ఉపాధ్యక్షుడు దుచ్చరి కోటిబాబు, ప్రధాన కార్యదర్శి జార్తబాబురావు తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలికంగా నిర్మించిన రేకులషెడ్

# శిథిల భవనంలో చదువులు

- కూలిపోయే స్థితిలో పాఠశాల తరగతి గదులు
- బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న గిరిబాలలు
- తుండ్రుగూడలో తల్లిదండ్రులు, గ్రామస్తుల ఆందోళన

శిథిలావస్థలో పాఠశాల భవనం

**ప్రజాశక్తి -దుంబ్రిగుడ:** ఎప్పుడు కూలుతాయో తెలియని స్థితిలో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాల్లో గిరి విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువులు కొనసాగిస్తున్నారు. దీనిపై ఎన్నోసార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరమ పంచాయతీ తుండ్రంగుడ పాఠశాలలో 27 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆ పాఠశాల పరిధిలో రెండు గ్రామాల నుండి విద్యార్థులు విద్యాబోధన సాగిస్తున్నారు. మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. శ్లాబ్ పైకప్పు పెచ్చులూడి, ఇటీవల కురుస్తున్న వర్షాలకు పైకప్పు, గోడలు అన్నీపూర్తిగా చెమ్మబారిపోయి, శ్లాబ్ నుంచి నీరు కారుతోంది. దీంతో ఏక్షణాన ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనిన విద్యార్థులు, తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయులూ, స్థానికులు ఆవేదన చెందుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో అదే భవనంలో అవస్థలు పడుతూ విద్యాబుద్ధులు నేర్చుకుంటున్నారు.



పూర్తిగా పాడై పెచ్చులూడిన భవనం పైకప్పు

గత ప్రభుత్వం నాడు నేడు పథకం కింద అనేక పాఠశాల భవనాల నిర్మాణంతోపాటు పాఠశాలల్లో సౌకర్యాలను కూడా కల్పించింది. అయితే తుండ్రంగూడ పాఠశాల భవన దుస్థితిని మాత్రం పట్టించుకోలేదు.దీంతో నానాటికీ మరింత అధ్వానస్థితికి చేరుకున్న భవనంలో చదువులకు విద్యార్థులు బిక్కచచ్చిపోతున్నారు. ఈ.పాఠశాలకు అదనపు భవనం నిర్మిస్తే విద్యను అందించడాకి బాగుంటుందని గ్రామస్తులు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. వర్ష కాలంలో వర్షపు నీరు తరగతి గదుల లోపల కారుతుండడంతో తరగతులు నిర్వహించడానికి ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఉంది. పాఠశాల భవన పరిస్థితిని చూసి భయపడి పాఠశాలకు పంపించలేకపోతున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సంబంధిత ఉన్నతస్థాయి అధికారులు స్పందించి శిథిలావస్థలో ప్రమాదకరంగా ఉన్న తుండ్రంగుడ పాఠశాల భవనాలను కూల్చివేసి నూతన భవనాలను నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

వరండాలో భయపడుతూ తరగతుల నిర్వహణ

## వీధి కుక్కల బెడదను పరిష్కరించండి

**ప్రజాశక్తి-వి.ఆర్.పురం:** మండలంలోని రేఖపల్లి పంచాయతీ పరిధిలోని గొల్లగూడెం గ్రామంలో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇటీవల వీధికుక్కలు దాడిచేసిన ఘటనలో రెండు గొర్రెలు మృతి చెందాయని బాధితుడు కంపసాటి లక్ష్మణ్‌రావు ఆవేదన వ్యక్తం చేశాడు. కొన్ని రోజులుగా ఇదే తరహాలో పశువులపై వీధి కుక్కలు దాడులు చేస్తున్నాయని గొర్రెల కాపరులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీధికుక్కలను నియంత్రించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## పైప్‌లైన్‌కు మరమ్మతులు

**ప్రజాశక్తి-విఆర్‌పురం:** కూనవరం గ్రామంలోని శివాలయం వీధిలో గత కొన్ని రోజులుగా తాగునీటి కుళాయి పైప్‌లైన్ పగిలిపోయి నీరు కలుషితమవుతోంది. గ్రామస్తులు సర్పంచ్‌కు తెలియజేయడంతో స్పందించిన సర్పంచ్ హేమంత్ కొత్తపైపులు మార్చి తాగునీటిని అందించారు. గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

## వాగులు దాటొద్దు

**ప్రజాశక్తి-విఆర్‌పురం:** రానున్న రెండురోజులు అనగా బుధవారం, గురువారం కూడా అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున వ్యవసాయకూలీలు వాగులు దాటవద్దని పోలీసులు హెచ్చరించారు. మండలంలోని రాజుపేటకాలనీ, వడ్డేగూడెంకాలనీ, వడ్డేగూడెం బిసి కాలనీ, విఆర్‌పురం, సీతంపేట తదితర గ్రామస్తులు అన్నవరం వంతెనపై రాకపోకలు చేయవద్దని ఎస్ఐ సంతోష్‌కుమార్ హెచ్చరించారు.

## పోటాపోటీగా బందెలదొడ్డి వేలంపాట

**ప్రజాశక్తి-విఆర్‌పురం:** మండలంలోని రేకపల్లి పంచాయతీలో మంగళవారం గ్రామ సచివాలయం ముందు సర్పంచ్ పూణెం సరోజిని అధ్యక్షతన బందెలదొడ్డి వేలంపాట నిర్వహించారు. పోటాపోటీగా జరిగిన వేలంపాటలో సోడే భానుచందర్ తండ్రి దుర్గయ్య 19 వేల రూపాయలకు పాట దక్కించుకున్నారు.

## సిఐటియు మండల కమిటీ ఎన్నిక

మదేల ప్రసాదరావు

ముత్యాలమ్మ

**ప్రజాశక్తి -పాడేరు:** సిఐటియు పాడేరు మండల నూతన కమిటీ ఎన్నిక మంగళవారం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమా మహేశ్వరరావు సమక్షంలో ఏకగ్రీవంగా జరిగింది. మండల కన్వీనర్‌గా మదేల ప్రసాదరావు, కో కన్వీనర్‌గా ముత్యాలమ్మ (అనువర్త), సంజీవరావు(ఆటో), కమిటీ సభ్యులుగా అన్ని కార్మిక సంఘాల నుండి 20 మందిని ఎన్నుకున్నారు. సభ్యులుగా అంగన్వాడీల నుండి అంబికా, సిహెచ్ ఉద్యాణ మంది నాగమణి, సర్వశిక్ష ఉద్యోగుల సంఘం నుండి జయరాజు, మెడికల్ కాలేజ్ నుంచి ప్రసాద్, సెక్యూరిటీ సిబ్బంది నుంచి బాలన్న, ఆర్‌టిసి నుంచి భరత్, మూరా కార్మికుల నుంచి సూరిబాబు, కుమార్, వైద్యవిభాగం నుంచి లక్ష్మణ్, పంచాయతీరాజ్ నుంచి అప్పారావు, కాఫీ కార్మికుల నుంచి దేవి, వెలుగు నుంచి సువర్ణ, ఎండిఎం నుంచి సరస్వతి, హాస్టల్ వర్కర్స్, ఐటిడిఎ కాఫీ, విద్యుత్ ఎన్‌ఆర్‌ఇజిఎస్ బిల్డింగ్ తదితర రంగాల నుండి సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కన్వీనర్, కోకన్వీనర్లు మాట్లాడుతూ మండలంలో కార్మిక సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేపడతామన్నారు. సిఐటియు సహాయ కార్యదర్శి సుందరరావు పాల్గొన్నారు.

## విరిగిపడిన కొండచరియలు

**ప్రజాశక్తి -అనంతగిరి :** తుఫాన్ ప్రభావంతో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో మారుమూల గిరిజన గ్రామాలకు వెళ్లే మార్గంలో రోడ్డుపైకి కొండచరియలు విరిగిపడుతున్నాయి. దీంతో రాకపోకలకు ఏజెన్సీ వాసులు అవస్థలు పడుతున్నారు. పినకోట, పెదకోట మారుమూల పంచాయతీ పరిధి బోనూరు, పూతికపుట్టు మట్టి రోడ్డుపై సోమవారం సాయంత్రం కురిసిన వర్షంతో రోడ్డుపైకి కొండ చరియలు విరిగిపడ్డాయి. దీనితో టెంకలబంధ, పూతికపుట్టు, డిడిమెట్టు, బోనూరు, మరో తొమ్మిది గ్రామాల గిరిజనులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. నిత్యం మండల కేంద్రానికి వచ్చే ఆయా గ్రామాల గిరిజనులు రోడ్డుపై కొండచరియలతోపాటు మెకాలితోను గోతులున్న మార్గంలో రాకపోకలు సాగించలేని పరిస్థితి. అత్యవసర సమయంలో అంబులెన్సులు, బైకులు, ఇతర వాహనాలు ఆయా గ్రామాలకు రాలేని దుస్థితి నెలకొందని స్థానికులు అంటున్నారు. ఇదిలా ఉంటే, ఎగువవీధి నుంచి బొంగిజా, జెండగరువు నుండి ఊటగెడ్డ, బొడ్డపుట్ నుండి పుట్టపాడు, తెల్లరపాడు, రాజాపాక నుంచి డెక్కపురం, మెట్టవలస నుంచి ఓనుకోంద, జీలుగులపాడు నుంచి మెట్టవలస, మరదగూడ మెయిన్ రోడ్డు నుండి కమలాపురం మీదుగా సరుప్ప పాదరు, గుమ్మ కోట నుండి శంకుపట్టు...గాలిపాడుతో పాటు మండలంలోని పలు గ్రామాల మట్టి రోడ్డు భారీవర్షాలకు కోతకు గురై రాకపోకలు వీలులేని స్థితికి చేరుకున్నాయని ఆయా గ్రామాల గిరిజనులు అంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి, ఆయా గ్రామాలకు రాకపోకలకు వీలుగా రహదారులకు తక్షణ మరమ్మతులతోపాటు శాశ్వతప్రాతిపదికన పునర్నిర్మించాలని వేడుకుంటున్నారు..

## గ్రామాల్లో సమావేశాలు

**ప్రజాశక్తి - పెదబయలు :** మండలంలో అన్నదాత సుఖీభవ, సివిల్ సప్లై రేషన్ కార్డుల సమస్యలు పరిష్కారం కోసం సచివాలయాల వారీగా ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు వి.కొండయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అడుగుల పుట్టులో ఈ నెల 19న, ఇంజరి, కుంతుర్లలో 20న, లింగేటి, సీకరిలో 21న, పెద కోడపల్లి, పర్రెడలో 22న, జామిగూడ, బొండపల్లిలో 23న, సీతాగుంట, రూడకోటలో 25న, గంపరాయి, గోమాంగిలో 26న, కిముడుపల్లి, గిన్నెలకోటలో రెవిన్యూ అధికారులు, సచివాలయం సిబ్బంది, డిజిటల్ సిబ్బంది ఈ సమావేశాలు నిర్వహిస్తారని, వీటిని వినియోగించుకోవాలని కొండయ్య సూచించారు.

# చెల్లించని పించన్ల సొమ్ము రికవరీ

### జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె.అభిషేక్ గౌడ

**ప్రజాశక్తి -పాడేరు :** లబ్ధిదారులకు చెల్లించగా మిగిలిన సామాజిక పించన్ల నిల్వలను తిరిగి ప్రభుత్వానికి సత్వరమే చెల్లించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె. అభిషేక్ గౌడ ఆదేశించారు. సచివాలయాల పరిధిలో వెల్ఫేర్ అసిస్టెంట్ల నుండి రికవరీ చేయాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్ నుండి ఓ ఆరడిఎ డ్వామా, గిరిజన సంక్షేమ (విద్య) విద్యాశాఖ, గ్రామ వార్డు సచివాలయం, ఎస్ఎంఎ, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్త్రీ నిధి రుణాలు 10,686 సంఘాల నుంచి రికవరీ చేయాలని, అలాగే, బ్యాంకు అధికారులతో చర్చించి కొత్త రుణాలు మంజూరు చేయించాలని స్పష్టం చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఎస్ఎంఎ శాఖకు రూ.20 కోట్లతో 155 చెక్ డ్యాం పనులు మంజూరు చేసామని, నవంబరు నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశించారు. నీటి సంఘాల సమన్వయంతో నేటికీ పనులు ప్రారంభించని వాటిని సత్వరమే చేపట్టాలన్నారు. ఉపాధ్యాయులు లేని పాఠశాలల్లో సమీప పాఠశాలల నుండి టీచర్లను సర్దుబాటు చేశామని, వారు సక్రమంగా పాఠశాలలకు హాజరవుతున్నదీ, లేనిదీ ఎటిడబ్ల్యుఒలు పరిశీలించాలన్నారు. గంజాయి అలర్లపై విద్యార్థులకు వివరించాలన్నారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను గుర్తించి ఐటిడిఎ పిఒలకు నివేదించాలన్నారు. హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్న విద్యార్థులను గుర్తించి తగిన పోషకాహారం, ఔషధాలను అందించాలన్నారు. బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలని ఆదేశించారు. పాఠశాలల్లో 98 శాతం హాజరు వుండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. స్థానికంగా సీట్లు ఖాళీలు లేకపోతే సమీపంలో ఉన్న ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ఆదేశించారు. పాఠశాలలు భద్రతా ఆడిట్ వేగంగా పూర్తి చేయాలని ఎంఇఒలను ఆదేశించారు. సచివాలయాల పరిధిలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించాలన్నారు. తల్లికి వందనం సంబంధించి ఇకెవైసి పూర్తి చేసి లబ్దిదారులకు అందించాలన్నారు. మార్గదర్శుల రిజిస్ట్రేషన్, అర్హులైన బంగారు కుటుంబాల నమోదు చేపట్టాలన్నారు. తాగునీటి పనులను క్లోరినేషన్ చేయాలని, దోమల మందు పిచికారీ పనులు సక్రమంగా పూర్తి చేయాలన్నారు. ఉపాధి వేతన దారులకు కనీస వేతనాలు అందించే విధంగా పనులు చేయించాలన్నారు. పనిదినాలు పెంచాలన్నారు. సమావేశంలో రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కె. సింహాచలం, డిఆర్‌డిఎ పిడి వి. మురళీ, గిరిజన సంక్షేమశాఖ ఇంచార్జి డిడి క్రాంతి కుమార్, డిఇఒ పి. బ్రహ్మాజీ రావు, జిల్లా పంచాయతీ అధికారి కె.పి.చంద్ర శేఖర్, డ్వామా పిడి డాక్టర్ విద్యాసాగర్, ఎస్ఎంఎ డిఇఇ .నాగేశ్వరరావు, గ్రామ వార్డు సచివాలయం నోడల్ అధికారి పిఎస్ కుమార్, 22 మండలాల ఎటిడబ్ల్యుఒలు, ఎంఇఒలు, ఎంపిడిఒలు, ఉపాధి హామీ ఎపిఒలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు సౌకర్యం కల్పించాలి

### కొండవాగులో దిగి వరకుగుమ్మి ఆదివాసీల నిరసన

గెడ్డ నీటిలో నిరసన వ్యక్తం చేస్తున్న వరకుగుమ్మి పివిటిజిలు

**ప్రజాశక్తి ముంచింగిపుట్టు :** మండలంలోని కించాయిపుట్టు గ్రామపంచాయతీ వరకుగుమ్మి గ్రామ సమీపంలో వాగుపై తక్షణమే వంతెన నిర్మించాలని ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎంఎం శ్రీను, రాములు క్లస్టర్ పీసా కమిటీ ఉపాధ్యక్షుడు కిల్లో నారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం వాగు వద్ద గ్రామస్తులతో కలిసి నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు తెలుపుతూ వంతెన తక్షణమే నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎంఎం శ్రీను మాట్లాడుతూ మన్యంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహిస్తూ కల్వర్టులు, బ్రిడ్జిలు తెగిపోయి రాకపోకలకు మారుమూల మన్యవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసి పివిటిజి కోదు తెగ చెందిన గిరిజనులు నివసించే వరకుగుమ్మి గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న వాగుపై వంతెన లేకపోవడంతో వర్షాకాలంలో ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయే పరిస్థితి ఉందని, ముఖ్యంగా నిత్యావసరాలతోపాటు అత్యవసర పరిస్థితుల్లో గ్రామం నుంచి బయటకు రాలేకపోతున్నారని ఆవేదన వెలిబుచ్చారు.

గిరిజన చిన్నారులు విద్యాభ్యాసానికి పాఠశాలలో వెళ్లేందుకు వాగు దాటాల్సిన పరిస్థితుల్లో వర్షాల సీజన్‌లో వారి చదువులు అటకెక్కిపోతున్నాయని వాపోయారు. గర్భిణులు ప్రసవానికి వెళ్లాలన్నా, అత్యవసర పరిస్థితుల్లోనైనా వైద్యానికి ఆసుపత్రికి వెళ్లాలన్నా ఇబ్బందులు తప్పడం లేదన్నారు వాగు ఉధృతి తగ్గితే మూడు కిలోమీటర్లు డోలిలో మోసుకెళ్లి ఆసుపత్రులకు తీసుకెళుతున్నారని, ఇక వర్షాలు కురిసి, వాగు ఉప్పొంగితే గ్రామంలోనే మగ్గాల్సిన దయనీయ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రోడ్డు సౌకర్యానికి అధిక ప్రాధాన్యతనిస్తామని కూటమి ప్రభుత్వం, ముఖ్యంగా డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ గొప్పగా ప్రకటించిన నేపథ్యంలో దాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పిఎం జన్‌మన్ పథకంలో వరకుగుమ్మి గ్రామానికి రోడ్డు సౌకర్యాన్ని కల్పిస్తూ, వంతెనను తక్షణమే నిర్మించాలని కోరుతున్నారు.

# భోజన బిల్లు బకాయిలు చెల్లించండి

### సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

**ప్రజాశక్తి -అరకులోయ రూరల్:** రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, అయితే ప్రారంభం నుండి సుమారు 6 నెలలు గడుస్తున్నా నేటికీ మధ్యాహ్న భోజనం కార్మికులకు బిల్లులు చెల్లించలేదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు విమర్శించారు. మంగళవారం అరకులోయ జూనియర్ కళాశాలను సందర్శించి, మధ్యాహ్న భోజన కార్మికులతో మాట్లాడి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటివరకు వడ్డీలకు అప్పులు చేసి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెడుతున్నారని, ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించకపోతే మధ్యాహ్న భోజన నిర్వహణ కార్మికులకు భారమౌతుందన్నారుఉ. సరైన వంట షెడ్లు లేకపోవడంతో కార్మికులు సొంత డబ్బులతో షెడ్ల నిర్వహించి వంట చేస్తున్నారని తెలిపారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత అధికారులు స్పందించి, తక్షణమే భోజన బిల్లు బకాయిల చెల్లింపులకు నిధులువిడుదల చేయాలని, వంట షెడ్లు నిర్మించాలని, ఇతర సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే జిల్లా వ్యాప్తంగా కార్మికులను కదిలించి డిఇఒ కార్యాలయాన్ని ముట్టడించక తప్పదని హెచ్చరించారు.

భోజన నిర్వాహకులతో మాట్లాడుతున్న మహేశ్వరరావు

## నేరాలు ఘోరాలు

### గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

**ప్రజాశక్తి - హుకుంపేట :** వాగు దాటే క్రమంలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మండలంలోని అడ్డుమండ గ్రామానికి చెందిన కుమ్మర స్వామి అదివారం నిత్యావసర సరుకుల కొనుగోలుకు మోదపల్లి గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో కాజ్‌వేపై వాగు దాటుతుండగా, వరద నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు రెండు రోజుల పాటు వాగులో గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం దొరకలేదు. మంగళవారం హుకుంపేట,పెదేరు మండలాల సరిహద్దు గ్రామమైన అడ్డూరిమెట్ట సమీపంలో మృతదేహం లభించింది. పశువుల కాపరి మృతదేహాన్ని గుర్తించి బాధిత కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అక్కడికి చేరుకోగా, ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది సహాయంతో మృతదేహాన్ని వాగు నుండి బయటకు తీసి తరలించారు.

## బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి : సిపిఎం

వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు

**ప్రజాశక్తి - అరకులోయ రూరల్:** ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఇళ్లు కూలిపోయిన బాధిత కుటుంబాన్ని వెంటనే ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు డిమాండ్ చేశారు. మండలంలోని బస్కి పంచాయతీ, మొర్రిగూడ గ్రామానికి చెందిన గొల్లోరి అప్పలస్వామికి చెందిన ఇంటిగోడ విస్తారంగా కురుస్తున్న వర్షాలకు సోమవారం ఉదయర కూలిపోయింది. విషయం తెలుసుకున్న సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు, పీసా కమిటి ఉపాధ్యక్షుడు కె మార్కండ్, కె జోయో మంగళవారం గ్రామాన్ని సందర్శించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. గోడ కూలిన ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం విఆర్ఓను కలిసి, విషయాన్ని తెలియజేసి, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని వినతిపత్రాన్ని అందజేశారు .ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరడం వల్ల గోడ తడిసి కూలిపోయిందన్నారు. దీంతో ఇంట్లోని ధాన్యం, రాగులు, ఇతర సరుకులు తడిసిపాడయ్యాయన్నారు. బాధిత కుటుంబానికి తక్షణసాయంగా 50 కేజీలు బియ్యం, పప్పు, వంట నూనె, దుస్తులు అందజేయాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇల్లు కూలిపోయిన కుటుంబానికి నూతన ఇల్లు మంజూరు చేసి, నష్ట పరిహారం అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

## మూగజీవుల రక్షణపై అప్రమత్తత

**ప్రజాశక్తి -అనంతగిరి:** మండలంలోని తుఫాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మూగజీవాల పెంపకం దారులు వాటి రక్షణపై అప్రమత్తంగా ఉండాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ సాగరి. గణేశ్వరరావు అన్నారు. మంగళవారం టోకూరు గ్రామంలో పర్యటించారు తుఫాను నష్టాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రైతులకు పలుసూచనలు చేశారు. వర్షాలు కురిసే సమయంలో పశువులు, మేకలను సురక్షిత మైన పశువులశాలలో కట్టి, దాణా అందించాలన్నారు. వర్షాల ఉధృతికి వాగులు,గెడ్డలు పొంగి ప్రవహించే వీలున్నందున మేతకు అడవుల్లోకి తీసుకెళ్లడం, అక్కడ వదిలి రావడం మంచిదికాదన్నారు. పశువులు వ్యాధులు బారిన పడినప్పుడు తగిన వైద్యసేవలు అందించాలన్నారు. అందుబాటులో ఉన్న పశువైద్యకేంద్రానికి సమాచారం ఇవ్వాలని సూచించారు.కార్యక్రమంలో అనంతగిరి లైవ్ స్టాక్ అధికారి మూర్తి. బొర్రా గ్రామీణ పశు వైద్య అధికారి జగదీష్ సిబ్బంది పాల్గొన్నారు

## శక్తియాప్‌పై విద్యార్థులకు అవగాహన

**ప్రజాశక్తి -జి.మాడుగుల** మండల కేంద్రంలో కొత్తూరు గ్రామ సమీపాన ఉన్న కెజిబివి బాలికల ఉన్నత పాఠశాలను స్థానిక ఎస్ఐ షణ్ముఖరావు మంగళవారం సందర్శించారు, విద్యార్థినులకు శక్తి యాప్ పై అవగాహన కల్పించారు. క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదివి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని భరోసానిచ్చారు.కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## చెత్త సేకరణ శతశాతం జరగాలి

**- డివి.రమణమూర్తి**

**ప్రజాశక్తి -ఎంవిపికాలనీ:** వ్యర్థాల సేకరణ శతశాతం జరగాలని జివిఎంసి అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి ప్రజాఆరోగ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశాల మేరకు జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజాఆరోగ్య విభాగంపై జివిఎంసి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.ఎన్.వి నరేష్ కుమార్, ఇతర ప్రజా ఆరోగ్య అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వర్షాలు కురుస్తున్నందున ప్రజా ఆరోగ్యఅధికారులు, పారిశుధ్య కార్మికులు నిత్యం చెత్తపేరుకు పోకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణ చేయాలని, చాలా వార్డులలో చెత్త సేకరణ అనుకున్న స్థాయిలో జరగడం లేదని ఆయా శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆరా తీశారు. వర్షాల వలన సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఎప్పటికప్పుడు వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలని ఆదేశించారు. ఆగస్టు 27న వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా అనుమతుల కొరకు సింగిల్ విండో క్లియరెన్స్ సెల్ జివిఎంసి అన్ని జోనల్ కార్యలయాలతో పాటు ప్రధాన కార్యలయంలోను ఇప్పటికే ఏర్పాటు చేసామని, సాధ్యమైనంతవరకు జోనల్ కార్యలయంలోనే అనుమతులు ఇచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో సహాయ వైద్యాధికారులు, జివిఎంసి బయాలజిస్ట్, శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ కార్యదర్శులు, మలేరియా సిబ్బంది, వెటర్నరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

## 20 నుండి కోర్టు ఉద్యోగాలకు పరీక్షలు

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టిరాజు**

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్:** జిల్లాలోని న్యాయస్థానాల్లో సిబ్బంది నియామకానికి ఈ నెల 20 నుండి 24 వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు తెలిపారు. పరీక్షల నిర్వహణపై హైకోర్టు జారీ చేసిన సూచనలను చిన్నంశెట్టిరాజు జిల్లా జడ్జి ఛాంబరులో మంగళవారం మీడియాకు వివరించారు. జిల్లా కోర్టులో స్టెనోగ్రాఫర్-3, జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, ఫీల్డ్ అసిస్టెంట్, ఎగ్జామినర్, కాపియిస్ట్, డ్రైవర్, రికార్డ్ అసిస్టెంట్, ఆఫీసు సబార్డినేట్ పోస్టులకు పరీక్షలు నిర్వహిస్తారని, 3 షిఫ్టలలో ఈ పరీక్షలు కంప్యూటర్ ద్వారా జరుగుతాయన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు పరీక్షా సమయానికి 15 నిమిషాలు ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఐడిప్రూఫ్‌ను తీసుకురావాలన్నారు. హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవడంలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే హెల్ప్‌డెస్క్‌నంబరు 0863-237252 లేదా helpdesk-hc.ap.aij.gov.in మెయిల్ ద్వారా సంప్రదించాలన్నారు. పరీక్షల్లో అర్హత సాధించిన స్టెనోగ్రాఫర్-3 జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, కాపీయిస్ట్, డ్రైవర్లకు తరువాత స్కిల్‌టెస్ట్ నిర్వహిస్తానన్నారు. దివ్యాంగులైన పరీక్ష రాయలేని వారికి మెడికల్ ఎమర్జెన్సీ వలన పరీక్ష రాయలేని వారికి వారి అభ్యర్థన మేరకు స్క్రైబ్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. నోటిఫికేషన్‌లో ఇచ్చిన నిబంధనల ప్రకారం పరీక్షలు జరుగుతాయని అభ్యర్థులు ఎటువంటి ప్రలోభాలకు లోనుకావద్దని పుకార్లను నమ్మవద్దని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు తెలిపారు.

## లోక్‌అదాలత్ ద్వారా కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్:** జాతీయ లోక్‌అదాలత్ ద్వారా ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని, జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి ఆర్.సన్యాసినాయుడు కోరారు. న్యాయసేవసదన్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, విశాఖపట్నంలో బీమా సంస్థల అధికారులు, స్టాండింగ్ కౌన్సిల్స్, ఎంవిఐపి కేసుల్లో పిటిషనర్ న్యాయవాదులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. కేసుల పరిష్కారం, బీమావివాదాల సత్వర పరిష్కారంపై చర్చించారు. వచ్చేనెల 13న జరగబోయిన లోక్‌అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులను పరిష్కరిం చేందుకు సహకరించాలని కోరారు. రాజీకి అవకాశం ఉన్న కేసులు గుర్తించి కక్షిదారు లకు లోక్‌అదాలత్ గురించి వివరించాలన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారంలో లోక్‌అదాలత్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో బీమాసంస్థల అధికారులు, స్టాండింగ్ కౌన్సిల్స్, ఎంవిఐపి కేసుల్లో పిటిషనర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## నగరాభివృద్ధికి సహకరించండి

**ప్రజాశక్తి -ఎంవిపికాలనీ:** నగరాభివృద్ధికి సహకరించాలని స్థాయిసంఘ సభ్యులను జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ కోరారు. మంగళవారం ఇటీవల నూతనంగా ఎన్నికైన జివిఎంసి స్థాయిసంఘం సభ్యులు జివిఎంసి ప్రధాన కార్యాలయంలో కమిషనర్ కేతన్‌గార్గ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. కమిషనర్ స్థాయిసంఘ సభ్యులను అభినందిస్తూ నగరాభివృద్ధికి సంబంధించి పనులపై క్షుణ్ణంగా చర్చించి ఆమోదం తెలిపి సహకరించాలని కోరారు.

# గిరిజన గ్రామాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

శిక్షణలో పాల్గొన్న రంపచోడవరం ఐటిడిఎ పిఒ,సబ్ కలెక్టర్

**ప్రజాశక్తి - రంపచోడవరం :** ఏజెన్సీలో ప్రతి గిరిజన గ్రామం అభివృద్ధి చెందే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ పథకాలు ఏర్పాటు చేయడం జరిగిందని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం అన్నారు. మంగళవారం ఐటిడిఎ సమావేశ భవనంలో ఏడు మండలాలకు చెందిన అధికారులతో ఆది కర్మయోగి పిఎం జూగా, డిఎ జూగా ప్రొగ్రాం అమలు చేయుటకు మాస్టర్ ట్రైనర్లతో మండలస్థాయి ట్రైనర్ల శిక్షణ కార్యక్రమాన్ని సబ్‌కలెక్టర్ శుభంనొక్వాల్, డిఎఫ్ఒ రవీంద్రధామతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పిఒ సింహాచలం మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం 2047 నాటికి మారుమూల ప్రాంతాల్లోని గిరిజనులు, గిరిజన గ్రామాలు అభివృద్ధి చేయుటకు త్రాగునీరు, వైద్యం, విద్య, రహదారులు, పింఛన్లు, ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా గ్రామవిజన్ మ్యాప్ సిద్ధం చేయుటకు ఆది కర్మయోగి ప్రొగ్రాం పిఎం జుగా, డిఎ ప్రొగ్రాం ద్వారా జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్లతో, మండలస్థాయి మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇచ్చి ఎంపిక చేసిన గిరిజన గ్రామాల ప్రజలకు వివిధ రకాలైన అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించి ఈ ప్రొగ్రాం అమలు చేసేందుకుఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మండలస్థాయి మాస్టర్ ట్రైనర్లకు సహకారం కావాలంటే ఏర్పాటు చేస్తామన్నారు. చదువుకున్న గిరిజన యువత చిన్నపరిశ్రమలు కూడా ఏర్పాటు చేయవచ్చన్నారు. ఆది కర్మయోగి ప్రొగ్రాం ద్వారా రానున్న రోజుల్లో ఏజెన్సీ ప్రాంతం ఒక రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దే విధంగా ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభంనొక్వాల్ మాట్లాడుతూ మారుమూల గ్రామాలు అభివృద్ధి చేయుటకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఏజెన్సీలోని గ్రామాల్లో ముఖ్యమైన సమస్యలు గ్రామవిజన్ మ్యాప్ ద్వారా తెలుసుకుని ఆయా సమస్యలు పరిష్కరించే విధంగా 2047 సంవత్సరం నాటికి గిరిజన ప్రాంత అభివృద్ధికి ఆది కర్మయోగి ప్రొగ్రాం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్ల ద్వారా మండలస్థాయి ట్రైనర్లు పూర్తి స్థాయిలో ఆది కర్మయోగి విధివిధానాలు అవగాహన చేసుకోవాలన్నారు. ఈ నెల 19వ తేదీ నుండి 21వ తేదీ వరకూ మూడు రోజుల పాటు జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్ల ద్వారా మండలస్థాయి మాస్టర్ ట్రైనర్లకు శికణ ఇస్తామని తెలిపారు. రంపచోడవరం డిఎఫ్ఒ రవీంద్రధామ మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజనులు సంస్కృతి సంప్రదాయాలు ఆచరిస్తూ జీవనం సాగిస్తున్నారని అదేవిధంగా బాగావెనకబడిన గిరిజన గ్రామాలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఆది కర్మయోగి కార్యక్రమాల ద్వారా వారి అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎపిఒ జనరల్ డిఎన్వి రమణ, జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్లు జి.శారదాదేవి, చంద్రకిరణ్, శిరీష, రామం, అచ్యుత్‌కిరణ్, ధ్రువకుమార్, ఎడిఎంహెచ్ఒ డాక్టర్ డేవిడ్, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, అన్ని మండలాల ఎంపిడిఒలు, విద్యాశాఖాధికారులు, సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, వైద్యాధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, సిడిపిఒలు పాల్గొన్నారు.

# పిహెచ్‌సిలో పూర్తి స్థాయి సిబ్బందిని నియమించాలి

**ప్రజాశక్తి -విఆర్‌పురం/కూనవరం:** కూనవరం మండల కేంద్రంలో ఉన్న పిహెచ్‌సిలో పూర్తిస్థాయి సిబ్బంది లేక అవస్థలు పడుతున్నారనిఆదివాసీ మెడికల్‌అండ్‌హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తుష్టి జోగారావు, ఐయన్ టియుసి డివిజన్ అధ్యక్షులు డి.శ్రీనివాస్ అన్నారు. ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్, ఐయన్‌టియుసి ఆధ్వర్యంలో మంగళవారం అత్యవసర సమావేశం నిర్వహిం చారు. సమావేశంలో చింతూరు డివిజన్‌లో 10 పిహెచ్‌సిల ముఖ్యసభ్యులు అంతా హాజరయ్యారు. ఈ సందర్భంగా జోగా రావు, శ్రీనివాస్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరా లుగా చింతూరు డివిజన్‌లో సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లు లేకపోవడం వల్ల ఉద్యోగులు ఇబ్బందులు పడుతు న్నారని, సర్వీస్ రిజిస్టర్లు అప్‌డేట్ చేయలేకపోతున్నారన్నారు. యూనిఫాం, అలవెన్స్ సరెండర్‌లీవ్స్, జిపిఎఫ్ లాంటివి నాలుగు సంవత్సరాలుగా పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాల విషయంలో కూడా ఇబ్బందులు పడుతున్నట్టు తమదృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయమై గతంలో జిల్లా కలెక్టర్‌కి, ఐటిడిఎ పిఒకి డిఎంహెచ్ఒ, డిప్యూటీ డిఎంహెచ్ఒకి పలుమార్లు వినతిపత్రాలు అందించడం జరిగిందని అయినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. అధికారులు సమస్యను పరిష్కరించకపోతే ఉద్యోగులు అంతా ధర్నా చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. త్వరలో ఈ విషయమై ఉద్యోగులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణ చేస్తామని ప్రకటిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్‌ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సీత, ప్రచారకార్యదర్శి అర్జున్, సలహాదారులు భద్రకాళి,సీత, జయ,పున్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు

## శిథిలావస్థలో పెదజడుమూరు పాఠశాల

**ప్రజాశక్తి - జికెవీధి :** మండలంలోని సంకడ పంచాయతీ పెద జడమూరులో జిపిఎస్ పాఠశాల భవనం స్లాబ్ సీలింగ్ పెచ్చులు వూడి పిల్లలపై పడుతున్నాయని భారీ వర్షాలకు లీక్‌అవుతోందని విద్యాశాఖాధికారులు స్పందించి పాఠశాల భవనం మరమ్మత్తులు చేపట్టాలని టిడిపి గ్రామకమిటీ అధ్యక్షులు దేశగిరి గోవిందరావు పాఠశాల కమిటి చైర్మన్ మామిడి చంటిబాబు కోరారు. తరగతిగదిలో గచ్చులు పెచ్చులూడి గుంతలు పడ్డాయని దీంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. విద్యాశాఖాధికారులు స్పందించి పాఠశాల భవనానికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు, సంకాడ పంచాయతీ టిడిపి గ్రామకమిటి అధ్యక్షులు దేశకరి గోవిందరావు, మాజీసర్పంచ్ ఉలం బంగారయ్య, సడ్డ బొజ్జిపడాల్, మామిడి పెంటన్నదొర తదితరులు కోరారు.

ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్

## ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్ గొప్ప అనుభూతినిచ్చింది

**- జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్**

**ప్రజాశక్తి-ఎంవిపికాలనీ:** ప్రపంచ ఫోటోగ్రఫి దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన ఛాయాచిత్ర ప్రదర్శన గొప్ప అనుభూతిని ఇచ్చిందని జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ అన్నారు. బీచ్‌రోడ్డులో బుధవారం ప్రపంచ ఫోటోగ్రఫి దినోత్సవం సందర్భంగా విశాఖ మ్యూజియంలో వైజాగ్ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన రెండు రోజుల ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. స్వయంగా తన మొబైల్‌లో పలు ఫోటోలను క్లిక్ మనిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎగ్జిబిషన్ అద్భుతంగా ఉందన్నారు. వచ్చే సంవత్సరం తప్పకుండా స్క్రీన్ ద్వారా ఫొటోఎగ్జిబిషన్ ప్రదర్శన ఏర్పాటు చేయాలని దానికి జివిఎంసి సహకారం పూర్తిగా ఉంటుందన్నారు. వైజాగ్ ఫొటో జర్నలిస్టుల అధ్యక్షుడు వై.రామకృష్ణ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో జివిఎంసి జోన్ -3 జోనల్ కమిషనర్ శివప్రసాద్, విశాఖ మ్యూజియం అసిస్టెంట్ డైరెక్టర్ ఫాల్గుణరావు పాల్గొన్నారు.

## సిపిఐ మహాసభలను జయప్రదం చేయాలి

**ప్రజాశక్తి- కొయ్యూరు:** ఈనెల 20 నుండి 25 వరకు ఒంగోలులో జరగబోయే 28వ సిపిఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని అల్లూరి జిల్లా సిపిఐ కార్యదర్శి పొట్టిగ సత్యనారాయణ కోరారు. మంగళవారం కొయ్యూరు మండలం అంతడ పంచాయతీ మునసాలలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఉల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బుధవారం నుండి ఒంగోలులో రాష్ట్రమహాసభలు జరగనున్నందున జిల్లా నుండి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

## బాలికల మిస్సింగ్ కేసు ఛేదన

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్:** కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని గవర కంచరపాలెంలో ఇద్దరు బాలికలు అదృశ్యం అయ్యారు. సోమవారం రాత్రి జరిగిన సంఘటనపై బాలికలతల్లి గేదెలరేఖ కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గేదెల ప్రీతి(10 )గేదెల శతి(9) ఇంట్లో ఉండగా సాయంత్రం డ్యూటీ నుంచి వచ్చిన తల్లి రేఖకు తమపిల్లలు కనిపించకపోవడంతో కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కంచరపాలెం సిఐ రవికుమార్ ఈ విషయంపై ఉన్నతాధికారులకు తెలపగా, నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకబ్రతబాగ్చి మూడు టీంలను ఏర్పాటు చేశారు. బీచ్ ప్రాంతంలో ఒక టీం గాలిస్తుండగా కంచరపాలెంలో ఎస్సై దివ్యభారతి ఆధ్వర్యంలో ఓ టీం జల్లెడ పట్టారు. మరో టీం రైల్వేస్టేషన్ ప్రాంతంలో వెతుకుతుండగా, కంచరపాలెం రామ్మూర్తి పంతులుపేట వద్ద ప్రీతి, శృతి ఉన్నట్లుగా సమాచారం రావడంతో ఎస్సై దివ్యభారతి హుటాహుటిన వెళ్లి చిన్నారులను బుజ్జగించి తల్లికి అప్పగించారు. పోలీసులకు తల్లి కృతజ్ఞతలు తెలిపారు.